క్లుప్తంగా

నేడు మోటకట్ల శివాలయంలో అభిషేకం

సంబేపల్లె : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిల ఆదేశాల ప్రకారం శనివారం ఉదయం 9గంటలకు మండల పరిధిలోని మోటకట్ల శివాలయంలో స్వామి వారికి అభిషేకం పూజలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉదయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పూజా కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తప్పకుండా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

వీరభద్రస్వామి ఆలయంలో స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న ఆలయ సిబ్బంది

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమం శుక్రవారం 11 రోజుకు చేరుకుంది. దేవదాయ శాఖ కార్యాలయం కమిషనర్ వారి ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ డివి రమణారెడ్డి తెలిపారు. ఆలయ సముదాయంతోపాటు ఆలయానికి చెందిన 37 గదులను శుభ్రం చేసినట్లు తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహారాలు ప్రదర్శించిన అంగన్‌వాడీలు

చిన్నమండెం : పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదమ్మ తెలిపారు. మండల పరిధిలోని కొత్తపల్లి పంచాయతీ దిన్నెమీదపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలలో భాగంగా పిల్లలు, తల్లులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలు రకాల చెట్లను నాటారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ శంకరయ్య, ఏఎన్ఎం, హెల్త్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్పత్రికి పరుపు, మంచం వితరణ



ఆస్పత్రికి అందజేస్తున్న దాతలు

గాలివీడు : మండలంలోని నూలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎస్.రహంతుల్లా, కరీముల్లా, సైపుల్లా వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అడ్జెస్టబుల్ మంచము, పరుపును శుక్రవారం వైద్యులు స్రవంతి రెడ్డి, శంకర్ నాయక్‌ల సమక్షంలో వితరణగా అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దేవేంద్రారెడ్డి, ఏఎన్ఎం కళావతి తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక సదస్సుకు ఆహ్వానం

నందలూరు : అన్నమయ్య జిల్లా స్థాయిలో నేడు శనివారం జరగనున్న సనాతన భారతీయ దేవాలయాల పరిరక్షణ సదస్సుకు ప్రధాన వక్తగా రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్‌కు అన్నమయ్య జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సి.విశ్వనాథ్ ఆహ్వానం పంపారు. ఈ సందర్భంగా పసుపులేటి శంకర్ మాట్లాడుతూ రాయచోటిలోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో ఉదయం 10 గంటల నుంచి సదస్సు జరుగనుందన్నారు. సదస్సులో జిల్లాలోని దేవాలయాల పాలకవర్గ చైర్మన్‌లు, పూజారులు, సిబ్బంది, ధార్మిక భావాలు కల వ్యక్తులు పాల్గొంటారని తెలిపారు.

వీరభద్రుడిని దర్శించుకున్న కోడూరు ఎమ్మెల్యే



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తదితరులు

చిట్వేలి : పాత చిట్వేలిలో వెలసివున్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులు పలు సమస్యలను వారి దృష్టికి తేగా సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే ఆలయ కమిటీ రిని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సాయి వికాస్‌రెడ్డి, కోడలు శిరీషా రెడ్డి, గ్రామస్తులు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా సాగుతున్న ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు
- అభినందనలు తెలిపిన ఉపాధ్యాయులు



లక్కిరెడ్డిపల్లె: రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ నాగలక్ష్మి



రాజంపేట టౌన్: జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం, పీఈటీలు

ఓబులవారిపల్లె : రాష్ట్రస్థాయి బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలకు వై.కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు శుక్రవారం ప్రధానోపాధ్యాయులు సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. పుల్లంపేటలో జరిగిన జిల్లాస్థాయి అండర్–19 బేస్‌బాల్ మల్లికార్జున, బి.రాజమౌళి, సాఫ్ట్‌బాల్ వై.హరి బాబు, జి.హేమంత్‌లు ఎంపికయ్యారన్నారు. వీరు పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయిలో నిర్వహించే క్రీడా పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

రాజంపేట టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం నాగమణి శుక్రవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి పోటీల్లో అథ్లెటిక్స్ అండర్–14 విభాగంలో వి.సంతోష్, ఎస్.ఫాతిమ, డి.జగన్, అండర్–17 విభాగంలో టి.సిద్దేశ్వర్ ఎంపికైనట్లు తెలిపారు. అలాగే కబడ్డీ అండర్–14 విభాగంలో వి.సంతోష్, డి.భానుప్రకాష్, అండర్–17 విభాగంలో జి.గురుదేవ్, టి.సిద్దేశ్వర్, ఖోఖో అండర్–14 విభాగంలో ఎస్.ఫాతిమ, అండర్–17 విభాగంలో ఎస్.సాల్మన్, జి.గురుదేవ్, వాలీబాల్ అండర్–17 విభాగంలో సంజయ్ ఎంపికై నట్లు హెచ్‌ఎం తెలిపారు. పీఈటీలు ఆనందమ్మ, పద్మావతి, ప్రసాద్‌లు క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి శిక్షణ ఇవ్వడం వల్లే తమ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు రాణించగలరని ఆమె ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు కేజీబీవీ విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లె : రాష్ట్రస్థాయి క్రీడలకు కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నాగలక్ష్మి తెలిపారు. అండర్–19 స్విమ్మింగ్, అండర్–14 రాష్ట్రస్థాయి క్రీడలకు ప్రమీల – ఫుట్‌బాల్, హాకీకి శిరీషాలు ఎంపికయ్యారన్నారు. జిల్లాస్థాయికి ధనలక్ష్మి, అథ్లెటిక్స్‌కు వైష్ణవి, రన్నింగ్‌లో శిరీషా, భవితలు ఎంపికై నట్లు వారు తెలిపారు. వచ్చే నెలలో రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడల్లో విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. అనంతరం ప్రిన్సిపల్ నాగలక్ష్మి విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు..

వీరబల్లె : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్ – 19 క్రికెట్ ఆటలు పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా తెలిపారు. ఈ విద్యార్థులు పుల్లంపేట ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన ఆటల పోటీలలో తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు డి.గిరివర్ధన్, వి.రామ్‌చరణ్, తౌఫిక్ అలీఖాన్‌లు క్రికెట్ పోటీలలో రాష్ట్రస్థాయిలో ఎంపికవ్వగా, సాఫ్ట్ బాల్‌లో మహీధర్, తిరుమల్, బేస్‌బాల్‌లో మహీధర్, ఎస్.అఫ్జల్ రాష్ట్రస్థాయిలో ఎంపికయ్యారని ప్రిన్సిపల్ తెలియజేశారు. అనంతరం కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రఘురామయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె: రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు



వీరబల్లె: క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బాధ్యతల స్వీకరణ



బి.శ్రీధర్ రావు, తహసీల్దార్

ఓబులవారిపల్లె : మండల తహసీల్దార్‌గా బి.శ్రీధర్ రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని, ఇందుకు ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈయన మదనపల్లి, బి.కొత్తకోట తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఓబులవారిపల్లె మండలానికి వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన ఇన్‌చార్జ్ తహసీల్దార్ పీర్‌మున్నీ రాజంపేట పట్టణానికి బదిలీపై వెళ్లారు.

పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్‌గా మహ్మద్ రఫీ

పుల్లంపేట : సబ్ రిజిస్ట్రార్‌గా మహ్మద్ రఫీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన మహ్మద్ ఆజాద్ జమ్మలమడుగుకు బదిలీ అయ్యారు.

అన్నదమ్ముల ఘర్షణ

గాలివీడు : మండలపరిధిలోని గొట్టివీడు గ్రామం గొల్లపల్లిలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రెడ్డి శేఖర్ నాయుడు, రెడ్డప్ప నాయుడు ఇంటి రహదారి విషయంలో ఘర్షణకు పాల్పడి అన్న రెడ్డప్ప నాయుడు తమ్ముడు రెడ్డి శేఖర్ ఎడమ చేతిపై గాయపరిచాడు. గాయపడిన వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం అతడిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించినట్టు పోలీసులు తెలియజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

రాయచోటి అర్బన్/రాయచోటి (జగదాంబ సెంటర్) : రాష్ట్రంలో మున్సిపల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం యూటీఎఫ్ నేతలు, సభ్యులు డీఈఓ శివప్రకాష్‌రెడ్డిని కలుసుకుని మున్సిపల్ టీచర్ల ఉద్యమ కార్యాచరణ నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవిభజన జరిగి దశాబ్దం దాటుతున్నా పంచాయతీరాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు వర్తించే ఉత్తర్వులు, సౌకర్యాలు మున్సిపల్ టీచర్లకు వర్తించకపోవడం అన్యాయం అన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికీ తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేరన్నారు. 3, 4, 5 తరగతుల విలీనం జరిగిందే తప్ప బోధనకు స్కూల్ అసిస్టెంట్లను ఇవ్వలేదన్నారు. మున్సిపల్ టీచర్ల జీతాల నుంచి మినహాయించే సొమ్ము వారి ఖాతాలకు జమచేసేందుకు కాని, వినియోగించుకునేందుకు కాని అవకాశం లేకుండా పోవడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి మున్సిపల్ హైస్కూళ్లలో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించాలన్నారు. మున్సిపల్ హైస్కూళ్లలో హెచ్‌ఎంలలో అర్హులైన వారిని అర్బన్ ఎంఈఓలుగా నియమించాలన్నారు. టీచర్లకు వెంటనే జీపీఎఫ్ ఖాతాలను తెరవాలని, నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించి, బదిలీలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు చంద్రశేఖర్, వెంకటరమణ, రాధాక్రిష్ణ, సాదక్‌అలీఖాన్, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకు ఉద్యమ కార్యాచరణ నోటీసును అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

డ్యూటీ సమయంలో ప్రైవేటు క్లినిక్‌లో వైద్యులు

చర్యలు తీసుకోవాలని కోరిన సీపీఐ నేతలు

రాయచోటి అర్బన్ : ప్రైవేటు వైద్యం చేస్తున్న ప్రభుత్వ డాక్టర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, టి.ఎల్.వెంకటేష్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం డీఎస్‌ఎంఓ విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులు తమ విధుల నిర్వహణ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉండకుండా తాము ప్రైవేటుగా ఏర్పాటు చేసుకున్న క్లినిక్‌లలో రోగులకు వైద్యసేవలందిస్తుండడం దారుణమన్నారు. పైగా ప్రభుత్వాసుపత్రులకు విచ్చేసే పేద రోగులను సైతం తమ ప్రైవేటు క్లినిక్‌లకు రావాలంటూ ఒత్తిడి తెస్తుండడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ స్టోర్‌లలో తగినంత విద్యార్హత లేనివారితో మందులు విక్రయింప చేయడం, నర్సులు డాక్టర్లు చేసే వైద్యాన్ని చేస్తూ రోగులను ఇబ్బందులు పెడుతున్నారంటూ ఆరోపించారు. కొందరు ప్రభుత్వ వైద్యులు బినామీ పేర్లతో నిర్వహిస్తున్న క్లినిక్‌లలో లింగనిర్ధారణను చేస్తుండడం ఆందోళకరమన్నారు. జిల్లా వైద్యాధికారులు సదరు అంశాలపై విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రభుత్వ వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ నేతలు పుల్లయ్య, దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.



డీఎస్‌ఎంఓ విష్ణువర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ జిల్లా నేతలు

పూజలందుకున్న గంగాభవాని



అలంకారంలో అమ్మవారి మూలవిరాట్

సిద్దవటం : మండలంలోని బంగారుపేట గ్రామ సమీపంలో వెలసిన గంగాభవాని అమ్మవారికి శుక్రవారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించామని ఆలయ ఫ్యామిలీ ట్రస్టు అధ్యక్షుడు మాడా పెద్దసుబ్బరాయుడు, రామక్రిష్ణయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారికి గణపతి పూజ, స్వస్తిహో వాచనము, మాతృక పూజ, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కొందరు మహిళలు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

సత్యమ్మకు పూజలు



ప్రత్యేక అలంకారంలో సత్యమ్మ

పుల్లంపేట : కడప – చెన్నై జాతీయ రహదారి అనంతంపల్లి వద్ద వెలసిన శ్రీ సత్యమ్మతల్లికి శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా అమ్మవారు ప్రసిద్ధి. భక్తులు పూజలు చేసి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

స్వేచ్ఛాపూరిత బోధనకు అవకాశం కల్పించండి

సుండుపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో స్వేచ్ఛాపూరిత విద్యాబోధనకు అవకాశం కల్పించాలని ఎస్టీయూ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదులో భాగంగా శుక్రవారం సుండుపల్లె మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి మాట్లాడుతూ పాలకులు ఉపాధ్యాయులకు పనిభారాన్ని పెంచుతుండడం తగదన్నారు. ముఖ్యంగా యాప్‌ల నిర్వహణ పేరుతో శిక్షణ, వెబ్ మీటింగ్‌లు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ సబ్‌మిషన్ తదితర బోధనేతర సేవలను నిర్వహించాలంటూ ఒత్తిడి చేస్తుండడం దారుణమన్నారు. బోధనేతర కార్యక్రమాల నిర్వహణ వలన ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వేచ్ఛా పూరిత విద్యాబోధనను చేయలేకపోతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయించడం ఆపివేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నేతలు మున్వర్ బాషా, అజీజుర్‌రహిమాన్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి

ప్రమాదకరంగా ఫ్లైఓవర్ బ్రిడ్జి సేఫ్టీ వాల్

రాజంపేట టౌన్ : రాజంపేట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఈనెల 22వ తేదీన ఓ కారు ఆటోను తప్పించబోయి ఫ్లైఓవర్ ఫుట్‌పాత్ సేఫ్టీవాల్‌ను ఢీ కొట్టింది. ఆ సమయంలో సేఫ్టీవాల్‌కు ఉన్న కొన్ని దిమ్మెలు కిందపడ్డాయి. దీంతో అధికారులు ఫుట్‌పాత్‌పై నడిచేవారికి ప్రమాదం చోటు చేసుకోకుండా సన్నటి ఇనుపవలను అడ్డుపెట్టి చేతులు దులుపుకున్నారు. అయితే ప్రమాదకరంగా ఉన్న దిమ్మెలను మాత్రం అధికారులు తొలగింపచేయించలేదు. ఈ దిమ్మెలు కిందపడితే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న రోడ్డు మార్గంలో రాకపోకలు సాగించే పాదాచారులు, ద్విచక్రవాహనదారులపై కాని త్రిచక్రవాహనాలపై కాని పడితే పెద్ద ప్రమాదమే జరుగుతుందని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన రోజు అదృష్టవశాత్తు ఆ మార్గంలో ఎవరు రాకపోకలు సాగించకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. బ్రిడ్జిపై ప్రమాదకరంగా ఉన్న దిమ్మెల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని అక్కడి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధితశాఖ అధికారులు కిందపడేలా ఉన్న దిమ్మెలను వెంటనే తొలగించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ప్రమాదకరంగా కిందపడేలా ఉన్న సేఫ్టీ వాల్ దిమ్మెలు

నాటుసారా ఊట ధ్వంసం

పెద్దమండ్యం : సి.గొల్లపల్లె పంచాయతీలోని గంగతాతగారి పల్లె, చిన్నాయునివారిపల్లె, సి.గొల్లపల్లె ప్రాంతాలలో శుక్రవారం నాటుసారా తయారీ స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 1200 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఐ పి. వెంకటరమణ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల గృహ నిర్బంధం



వైఎస్సార్‌సీపీ నాయకుడిని గృహనిర్బంధం చేస్తున్న పోలీసులు

సుండుపల్లె : మండల పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులను తిరుమలకు వెళ్లకుండా పోలీసులు గృహనిర్బంధం చేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై జరుగుతున్న పరిణామాలను అపవిత్రం చేస్తున్న టీడీపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంఘీభావం తెలపడానికి సిద్ధమవుతున్న తరుణంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామస్వామి రెడ్డిని, చిన్న గొల్లపల్లి సర్పంచ్ రామజయచంద్రలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా రామస్వామి రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలో ఉన్న దేవాలయాలలో పూజలు చేయాలని కార్యకర్తలకు తెలిపారు.

ఆశ్రమంలో అన్నదానం



ఎల్లాయపల్లె ఆశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

ఓబులవారిపల్లె : విశ్రాంత ఏఎస్ఓ ప్రసాద్ తల్లి టి.సుబ్బమ్మ జ్ఞాపకార్థం ఎల్లాయపల్లె ఆశ్రమంలో శుక్రవారం విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఓబులవారిపల్లె తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్ఓగా పని చేస్తున్న ప్రసాద్ ఇటీవలే పదవీ విరమణ పొందారు. ఆశ్రమ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలి

లక్కిరెడ్డిపల్లె : అగ్ని ప్రమాదాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అగ్నిమాపక ఇన్‌చార్జ్ అధికారి రామయ్య పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లిలోని గ్లోబల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి విన్యాసాలు ద్వారా విద్యార్థులకు వివరించారు. ఇంటివద్ద అగ్గిపుల్లలతో ఆడుకోకూడదని, చిన్న నిప్పులు పెద్ద మంటగా ఏర్పడి ఇళ్లలోని గ్యాస్ సిలిండర్ పేలి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. చిన్న పిల్లలను అగ్గి పెట్టెలకు దూరంగా ఉంచాలన్నారు. పెద్దపెద్ద పరిశ్రమలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా ఎదుర్కోవాలి అన్న విషయాలు విన్యాసాల రూపంలో చేసి చూపించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దాక్షాయిని, ఉపాధ్యాయులు, ఫైర్ సిబ్బంది సుదర్శన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

30న హార్సిలీహిల్స్ సొసైటీ సమావేశం

బి.కొత్తకోట : ఈనెల 30న మదనపల్లెలో హార్సిలీహిల్స్ సహకార గృహ నిర్మాణ సంఘ సమావేశం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. 10 గంటలకు జరిగే సమావేశంలో కోర్టు వ్యవహారాలకు సంబంధించి చర్చిస్తామని, సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

సుండుపల్లె : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఎస్.అంజాద్ బాషా, ఎస్‌టీజీ, ఎంపీపీఎస్, సిద్దారెడ్డిగారిపల్లి (ఉర్దూ)ను మండల ఎస్టీయూ నాయకులు, పేరెంట్స్ కమిటీ, మండలంలోని ఇతర సంఘం నాయకులు సన్మానించారు. అనంతరం ఎస్టీయూ నేత అంకం శివారెడ్డి మాట్లాడుతూ అంజాద్ బాషా వృత్తినే దైవంగా భావించిన వ్యక్తి అని, ఈ అవార్డు అంజాద్ బాషాకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు వెంకటేష్ నాయక్, రవీంద్ర నాయక్, ఆరిపుల్లా, నాయకులు, మున్వర్ బాషా, ప్రధానోపాధ్యాయులు అబీదుల్లా, విద్యార్థులు, ఎంఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అంజాద్ బాషాను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు